

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి

ప్రజాశక్తి - నరసాపురం

అర్బన్ పిహెచ్‌సిలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయి ఆదేశించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని మున్సిఫ్ స్ట్రీట్, ఎన్‌టిఆర్ కాలనీ, అర్బన్ పిహెచ్‌సిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సూచనలు చేశారు. సమయానికి వైద్యులు విధులకు హాజరుకావాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పిహెచ్‌సిల్లో అందిస్తున్న సేవలపై ఫిర్యాదులు వస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఎస్ఓ సర్వేశ్వరరావు, డిపిహెచ్ వెంకట రమణారావు, పిహెచ్‌సి డాక్టర్స్ మోహనా, రంజిత్ కుమార్ ఉన్నారు.

గురుకులం మూత.. విద్యార్థులు రోడ్డున..!

పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ మూత

దాదాపు 700 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన

విద్యాసంవత్సరం ప్రారంభమై నెలదాటినా ఇళ్ల వద్దే విద్యార్థులు

అధికారుల నుంచి సరైన సమాధానం కరువు..

ఎంఎల్ఎ ధర్మరాజు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యార్థుల భవిష్యత్తు గురించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదా.. వాళ్ల పనులే తప్ప విద్యార్థుల చదువుల గురించి ఆలోచించే తీరిక ఏ ఒక్కరికీ లేదా.. అర్ధాంతరంగా గురుకుల పాఠశాల మూతపడి వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినా పట్టించుకోరా.. పరిశీలనల పేరుతో కాలక్షేపం చేస్తున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. భీమడోలు మండలం పొలసానిపల్లిలోని గురుకుల పాఠశాలకు ఎంతో గొప్ప పేరు ఉంది. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఈ గురుకులంలో విద్యాబోధన సాగుతోంది. నవోదయ, ఎపిఆర్‌జెసి వంటి పరీక్షలు రాసి ఇక్కడ సీటు పొందేందుకు విద్యార్థులు ఎంతో కష్టపడుతుంటారు. అలాంటి గురుకులాన్ని ప్రస్తుతం పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పొలసానిపల్లి గురుకుల పాఠశాలలో ప్రస్తుతం 700 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. జూన్ 12వ తేదీన రాష్ట్రంలోని విద్యా సంస్థలు మొత్తం తెరుచుకున్నా ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన పొలసానిపల్లి గురుకుల పాఠశాల మాత్రం తెరుచుకోలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల దాటేసినా విద్యార్థులు ఇంకా ఇంటి దగ్గరే ఉన్నారు. వర్షాలకు కొన్ని భవనాలు పడిపోవడంతో ఇబ్బందులు ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. భవనాలు కూలిపోయే పరిస్థితి వచ్చే వరకూ కొత్త భవనాల నిర్మాణం గురించి ఎందుకు ఆలోచించలేదో అంతుచిక్కని ప్రశ్నగా ఉంది. ఇంటర్‌కు సంబంధించిన భవనాలు బాగానే ఉండడంతో ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి ఇక్కడ చేర్చుకున్నారు. ఇంతలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనతో ఇంటర్ విద్యార్థులు సైతం ఇప్పుడు అక్కడ లేని పరిస్థితి. ఐదు నుంచి ఇంటర్ వరకూ చదివే దాదాపు 700 మంది విద్యార్థులు ఇంటికే పరిమితమైపోయారు. గురుకులంలో ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గురుకుల పాఠశాల ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఈ ఏడాది చదువుల పరిస్థితిపై ఏ ఒక్కరీ నుంచీ సరైన సమాధానం రాని పరిస్థితి. తాత్కాలికంగా ఎక్కడైనా తరగతులు నిర్వహిస్తారా.. లేక వేరే గురుకులంలోకి తరలిస్తారా ఏంటనేది తేల్చని పరిస్థితి నెలకొంది. పొలసానిపల్లి గురుకులంలో దాదాపు 20 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులంతా ప్రస్తుతం ఏంచేయలేని పరిస్థితి నెలకొంది. భవనాలు దెబ్బతిని నెలలు గడుస్తున్నా అధికారులు ఇప్పటి వరకూ ఏ నిర్ణయమూ తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికారులు రావడం పరిశీలించి వెళ్లడంతోనే కాలం గడిచిపోతోంది. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు నెలరోజులుగా పాఠాలు లేకుండా పోయాయి. వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు ఏవిధంగా రాస్తారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. 700 మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఇటీవల జరిగిన విద్యార్థి ఆత్మహత్య ఘటనతో అక్కడ ఇంటర్ చదువులు నిలిచిపోయాయి. అదేమని అడిగితే తల్లిదండ్రులు భయంతో పిల్లలను తీసుకెళ్లిపోయారని చెబుతున్నారు. తల్లిదండ్రులకు సమస్యను వివరించి విద్యార్థులను తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపైనా లేదా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల చదువు పట్ల ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్న చర్చ జనాల్లో నెలకొంది.



పొలసానిపల్లి గురుకుల పాఠశాల

ఎప్పటికి తెరుస్తారు.. విద్యార్థుల పరిస్థితి ఏమిటి?

పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీని ఎప్పటికి తెరుస్తారన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది. తమ పిల్లల పరిస్థితి ఏంటో ప్రభుత్వం చెప్పాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అక్కడే క్లాసులు కొనసాగిస్తారా.. లేకపోతే ఎక్కడికైనా మార్పు చేస్తారా ఏ విషయం తేల్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పైఅధికారులు రావడం వెళ్లడం తప్ప ఏ నిర్ణయం చెప్పడం లేదన్న చర్చ సాగుతోంది. రోజులు గడిచిపోతుడంతో విద్యార్థుల భవిష్యత్తుపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

ఎంఎల్ఎ పట్టించుకోరా..

తన నియోజకవర్గంలో గురుకులం మూతపడి 700 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారితే స్థానిక ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకూ ఆయన ఈ స్కూల్‌కు సంబంధించి ఏం చర్యలు తీసుకున్నారో మాట్లాడలేదని అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో ఇంత పెద్ద సమస్య నెలకొంటే సిఎం, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను ఎంఎల్ఎ పరిష్కంచకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇన్‌ఛార్జి మంత్రి మీటింగ్ జరిగింది. ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికైనా సమస్యను తీసుకెళ్లారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ముందుకు

బి.ఉమాకుమారి, గురుకుల విద్య జిల్లా కోఆర్డినేటర్

ప్రస్తుతం పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ పనిచేయడం లేదు. భవనాల సమస్య రావడంతో ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. పిల్లలను పిలవమని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చిన తర్వాత పిలుస్తాం. ప్రత్యామ్నాయంగా ద్వారకాతిరుమలలో కొన్ని తరగతులు, కొంత మంది విద్యార్థులకు వేరేచోట విద్యాబోధన చేయాలా అన్నదానిపై ఆలోచనలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందుకు సాగుతాం.

పి4 అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - కాళ్ల

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పి4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బొండాడలో పి4 గ్రామసభను కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించారు. బొండాడలో గుర్తించిన 128 బంగారు కుటుంబాలకు సంబంధించి జాబితాను గ్రామ కార్యదర్శి గ్రామసభలో పేరు పేరునా చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ బంగారు కుటుంబాలకు మార్గ నిర్దేశం చేసేందుకు సంపన్నులుగా ఉండడం ఒక విషయం అయితే, అన్నింటికంటే గొప్ప హృదయం కూడా కలిగి ఉండాలన్నారు. ప్రతి బంగారు కుటుంబానికీ ఒకే విధమైన సహాయం అవసరం ఉండదని, కొందరికి ఆర్థికంగా అయితే, మరికొందరికి పిల్లల చదువులు తదితర విషయాలకు మార్గదర్శకంగా ఉండాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు లేని, చదువుకుంటున్న పిల్లలను, ఏ ఆధారం లేని పెద్దలు, మధ్య వయసులో ఉండి ఆర్థికంగా వెసులుబాటు లేని కుటుంబాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలనలో పి4 కార్యక్రమం కీలకంగా వ్యవహరించనుందన్నారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించడంతో పాటు వారిని దత్తత తీసుకునేందుకు మార్గదర్శులను గుర్తించి ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోశిరెడ్డి, డ్వామా పీడీ, పి4 స్పెషల్ ఆఫీసర్ కెసిహెచ్.అప్పారావు, ఎంపిడిఓ జి.స్వాతి, గ్రామ సర్పంచి మన్నే వరలక్ష్మి పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సమ్మె కాలపు హామీలు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు గతంలో నిర్వహించిన 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలు ఉండాలన్నారు. చనిపోయిన లేదా అనారోగ్యంతో రిటైర్డ్ అయితే ఆ స్థానంలో వారి వారసులకు అవకాశం ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుధ్య కార్మికులతో సమానంగా వేతనాలు పెంచాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు నైపుణ్యాన్ని బట్టి వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జనాలు వెంకట్రావు, మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తాడికొండ జయరాం కార్యదర్శి దనాల రాజు, నాయకులు ఎస్.సతీష్, నీలాపు ధనరాజు, కె.దయామణి నాయకత్వం వహించారు.


సమ్మెలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి - ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద డిఎస్‌సి 2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో వందల మంది ఉపాధ్యాయులు తమకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ తమది డబల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 2003లో నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియ అంతా పూర్తయినప్పటికీ అప్పటి ప్రభుత్వం కావాలనే నియామక ఉత్తర్వులు ఆలస్యంగా ఇచ్చిందని, 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమల్లోకి తెచ్చిందని తెలిపారు. సిపిఎస్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత తమకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు కాబట్టి తమకు పాత పెన్షన్ విధానం వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం కావాలనే మోసం చేస్తోందని అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మెమో 57 ఇచ్చి వీరందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని చెప్పిందని, దేశంలో 16 రాష్ట్రాల్లో ఈ విధానం అమలు చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, తపాలా శాఖ వంటి వాటిల్లోనూ తమ ఉద్యోగులకు ఈ మెమోను అమలు చేసి న్యాయం చేశాయని, అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. ఇదే మెమో 57 ఆధారంగా రాష్ట్రంలో ముగ్గురు ఉన్నత ఐఎఎస్ అధికారులకు పాత పెన్షన్ వర్తింపజేస్తూ జిఓ ఇచ్చారని, అధికారులకు ఒక న్యాయం ఉపాధ్యాయులకు ఒక న్యాయమా, ఇది వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఆగస్టులో జరగనున్న శాసనమండలి సమావేశాల్లో ఈ విషయంపై తన గొంతు వినిపిస్తానని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయకపోతే ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ కార్యక్రమానికి మద్దతుగా ప్రసంగించారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్ కట్టా శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్లు జగదీష్, వెంకట్రావు, సూర్య ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

టిడ్కో గృహాల్లో వసతులు కల్పించాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

టిడ్కో ఇళ్లల్లో మౌలిక వసతులు కల్పించాలని, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ టిడ్కో గహాల్లో రెండు వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. ఇళ్లు నిర్మించి ఎనిమిదేళ్లయినా ఇంతవరకూ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా పేదవాడి కష్టాలు మాత్రం తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు సమస్యలు పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అలాగే మిగిలిన లబ్ధిదారులు 6,300 మందికి ఇంకా ఇళ్లు స్వాధీనం చేయలేదని, ఒక పక్క ఇంటి అద్దెలు కట్టలేక మరోపక్క బ్యాంకు తీసుకున్న డబ్బులకు వడ్డీలు కట్టాలని వేధిస్తున్నారని వాపోయారు. వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని, సచివాలయం, అంగన్వాడీ కేంద్రం, ఎలిమెంటరీ స్కూలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వాటితో పాటు రేషన్‌షాపు కూడా ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, మద్దాల రాంబాబు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, లబ్ధిదారులు

తాగునీరు అందించాలి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - పోడూరు

కోట్లాది రూపాయలు ప్రభుత్వ ధనాన్ని తాగునీటి సరఫరా కోసం ఖర్చు చేస్తున్నా గుక్కెడు నీటి కోసం రోడ్డు ఎక్కాల్సిన వస్తోందని కవిటం కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కవిటం మెయిన్ రోడ్డు సెంటర్లో ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 5 రోజుల నుంచి కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ఆందోళన చేపట్టామని తెలిపారు. కనీసం ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలని వేడుకుంటున్నా పంచాయతీ అధికారులు స్పందించడం లేదని వాపోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఖాళీ బిందెలతో రోడ్కెక్కాల్సిన వచ్చిందని మహిళలు, గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీల ఆధ్వర్యంలో సరఫరా అవుతున్న తాగునీరు మట్టి, మలినాలతో నిండిపోవడంతో సొమ్ములు వెచ్చించి నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు అందించాలని కోరారు.


ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు

మొగల్తూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మొగల్తూరు, వెంప రహదారి అధ్వానంగా మారింది. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు, శేరేపాలెం రహదారి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. సంబంధిత అధికారులు రహదారులకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు

ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమేద్దాం : కలెక్టర్

భీమవరం : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా జిల్లా అంతటా నేడు 3వ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదంతో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు స్థాయిలలో తప్పక నిర్వహించాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ కమిషనర్లు కార్యాచరణ ప్రణాళికను అనుసరించి కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జిల్లాలో గత ఆరు నెలల క్రితమే ప్లాస్టిక్ నిషేధాన్ని ఉద్యమ రూపంలో ప్రారంభించి అమలు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఇదే విషయాన్ని ఈ మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం కూడా పిలుపునివ్వడం ఎంతో సంతోషించదగిన విషయమన్నారు. ప్లాస్టిక్ నిషేధం అనేది ఒక్కరితో సాధ్యమయ్యేపని కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించిన నాడే ప్లాస్టిక్‌ను అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బజారుకెళ్లినప్పుడు తప్పనిసరిగా చేతి సంచిని తీసుకెళ్లి ప్లాస్టిక్ నిషేధంలో తొలి అడుగును వేయాలని పిలుపునిచ్చారు.

అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజలకు షాక్ కొట్టే అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పట్టణ ప్రజలకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం తాడేపల్లిగూడెం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని యాగర్లపల్లి, రామచంద్రరావు పేట, కొబ్బరి తోట వార్డుల్లో ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కరెంట్ మీటర్లను తొలగించి అదానీ స్మార్ట్ మీటర్లను బిగించాలని టిడిపి కూటమి ప్రభుత్వం చూస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, బిగించిన తరువాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు సెల్ ఫోన్ పద్ధతిలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలని, ఇంటికి వచ్చి రీడింగ్ తియ్యరని, బిల్లు ఇవ్వరని ఆయన తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగా సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల వరకు అధిక రేట్లు వసూలు చేస్తారని వాపోయారు. మీటరుకయ్యే ఖర్చు సింగిల్ ఫేజ్‌కి రూ.8,927, 3 ఫేజ్‌కి రూ.17,286 మనం చెల్లించాలని, వీటికి 93 నెలల్లో మీటరు అద్దె కస్టమరు నుంచి నెలవారీ వాయిదాలతో వసూలు చేయాలని ఆలోచన చేస్తున్నారని, దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కరెంట్ ఛార్జీలు భారీగా పెంచిందని బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి అనంతరం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎడాపెడా పన్నులు భారాలు, కరెంట్ ఛార్జీలు పెంచి రాష్ట్ర ప్రజల నడ్డి విరిచారని కూటమి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇవ్వడమే కాకుండా స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో చెత్త పన్ను చెల్లించకుండా పోరాడినట్లు ఇప్పుడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాడుదామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, నగిరెడ్డి సాయి, పతివాడ నాగేంద్రబాబు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.


ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

తాడేరు వాసులపై జనసేన ట్యాక్స్..!


కుళాయి కనెక్షన్ కావాలంటే జనసేనకు ట్యాక్స్ కట్టాల్సిందే..

గ్రామాభివృద్ధి కోసమే అంటున్న జనసేన నేతలు

వ్యతిరేకిస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని తాడేరు గ్రామంలో జనసేన నాయకులు ప్రజలకు ప్రత్యేక పన్నులు వేసి డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ఎవరైనా కుళాయి కనెక్షన్లు పంచాయతీ ద్వారా పొందాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి రూ.4,100 చెల్లించాలి. అయితే పంచాయతీకి డబ్బులు చెల్లించినంత మాత్రాన అధికారులు కుళాయి కనెక్షన్ ఇవ్వరు. జనసేన నాయకులకు ట్యాక్స్ కడితేనే కుళాయి కనెక్షన్లను పంచాయతీ అధికారులు మంజూరు చేస్తారు. ఇదేం విచిత్రం అనుకుంటున్నారా తాడేరు గ్రామంలో జనసేన నాయకులు ప్రజలను ఏవిధంగా దోచుకుంటున్నారదానికి ఇది నిదర్శనంగా కనిపిస్తోంది. ప్రత్యేకంగా గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో ఒక రసీదు బుక్కు తయారు చేయించి నాన్ లేఅవుట్లలో కుళాయి కనెక్షన్ పొందాలనుకునే వారి నుంచి రూ.11 వేలు, అన్ని అనుమతులు ఉండి కుళాయి కనెక్షన్ పొందాలనుకునే వారి వద్ద నుంచి రూ. 6 వేలు చొప్పున గ్రామంలోని జనసేన నాయకులు కట్టించుకుని వారికి రసీదులు ఇస్తున్నారు. ఈ విధానం పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమని, ఎవరైనా మాట్లాడితే గ్రామంలో అభివృద్ధి జరగాలంటే ఇటువంటి వసూళ్లు కచ్చితంగా చేయాల్సి ఉందని జనసేన నాయకులు చెబుతున్నారని పలువురు అంటున్నారు. ఇది తప్పని టిడిపి శ్రేణులు అంటున్న పరిస్థితి. ఈ అక్రమ వసూళ్లపై పంచాయతీ కార్యదర్శి పార్వతిని వివరణ కోరగా గ్రామంలో మైక్రో ఫిల్టర్ కోసం నాయకులు కూటమిగా ఏర్పడి వసూలు చేస్తున్నారని, పంచాయతీకి ఎటువంటి సంబంధమూ లేదని తెలిపారు. జనసేన గ్రామ అధ్యక్షులు మురళీని వివరణ కోరగా వసూళ్లు గత ప్రభుత్వంలో కూడా జరిగాయని, వారు రూ.5 లక్షలకుపైగా వసూలు చేసి రూ.లక్షా 18 వేలు తమకు ఇచ్చారని, అయితే గ్రామంలో గ్రామీణ సమస్య ఉందని తెలిపారు. మైక్రో ఫిల్టర్ ద్వారా తాగునీరందించేందుకు, గ్రామాభివృద్ధికి ఈ వసూళ్లు చేస్తున్నామని తెలిపారు. టిడిపి గ్రామ అధ్యక్షులు చిక్కాల వెంకటేశ్వరరావును వివరణ కోరగా గ్రామాభివృద్ధి పేరుతో కమిటీ ఏమీ లేదని అయితే జరుగుతున్న అక్రమ వసూళ్లపై పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వసూళ్లపై వైసిపి నాయకులను మించే విధంగా జనసేన నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, కూటమి నాయకులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి.


నెం. 10 రశీదు తేదీ: 27/06/2025

తాడేరు గ్రామ అభివృద్ధి నిమిత్తం

పేరు:

తండ్రి / భర్త పేరు:

గ్రామం:

ఇచ్చిన విరాళం: 11,000 (అక్షరాలా)

తీసుకున్నవారి సంతకం

తాడేరు గ్రామ అభివృద్ధి కమిటీ తరపున

గ్రామాభివృద్ధి నిమిత్తం ఇచ్చే రసీదు



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు

సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణారావు

ప్రజాశక్తి - భీమవరం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు హెచ్చరించారు. స్థానిక ప్యాలెస్ అండ్ లైన్ మర్చంట్స్ భవనంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ఐదవ మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభకు సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, బొప్పన ఆదమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణారావు ప్రారంభోపన్యాసం చేశారు. కార్మికవర్గ పోరాటంతో 1996లో దేశంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు సాధించారని తెలిపారు. సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయడం వల్ల వివాహం జరిగిన తర్వాత డెలివరీ స్కాలర్‌షిప్‌లో ప్రమాదం వంటి వేలాది క్లైములు పెండింగ్‌లో సంవత్సరాల తరబడి ఉండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఐక్యతా ఉద్యమించడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, యూనియన్ గౌరవాధ్యక్షులు చింతకాయల బాబురావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా టిడిపి కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. పాలకులకు కార్పొరేట్లు తప్ప కార్మికులు కనిపించడం లేదని ఆరోపించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు గత మూడేళ్ల కార్యకలాపాల నివేదికలు ప్రవేశపెట్టగా మహాసభ ఏకగ్రీవ ఆమోదించింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు చింతకాయల బాబురావు, అధ్యక్షులు నంగేడ్డ ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి మండా సూరిబాబు, ఉపాధ్యక్షులు దూలం ప్రసాద్, నూకల సత్యనారాయణ, నాగిశెట్టి గంగారావు, సహాయ కార్యదర్శిగా కేతనాగాంజనేయులు, కొల్లి శ్రీనివాసు, కోశాధికారిగా వీరవల్లి మాధవరావు మరో ఏడుగురుతో నూతన కమిటీ ఎన్నికైంది.

భూ యజమానులకు న్యాయం చేస్తాం : జెసి

వీరవాసరం : జాతీయ రహదారి 165 ఏర్పాటులో భాగంగా భూమిని కోల్పోతున్న భూ యజమానులందరికి న్యాయమైన ధర చెల్లించే విధంగా ప్రయత్నిస్తానని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి నిమిత్తం భూమి ఇవ్వడానికి అభ్యంతరాలు వ్యక్తంచేసిన భూ యజమానులతో శుక్రవారం వీరవాసరం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో 90 శాతం మంది భూ యజమానులు తమ భూములకు మార్కెట్ రేటుకు తగ్గట్టుగా నష్టపరిహారం చెల్లించాలని కోరారన్నారు. నిబంధనలకు లోబడి ఏవిధానంలో భూ యజమానులకు ఎక్కువ రేటు వస్తుందో ఆ విధానంలోనే నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ రేటు, గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన క్రయవిక్రయాల రేటును పరిగణలోకి తీసుకుంటామన్నారు. వీటిలో భూ యజమానులకు ఏ రేటు ఎక్కువ వర్తిస్తుందో ఆ రేటునే భూ యజమానులకు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. నిర్ధారించిన భూ విలువ రేటుకు రూరల్ ప్రాంతంలో 2.5, అర్బన్‌లో 2 రెట్లు అధికంగా ధర చెల్లిస్తామన్నారు. జిల్లాలో 478 ఎకరాలు జాతీయ రహదారి నిర్మాణానికి అవుతుండగా దీనిలో 185 మంది భూయజమానులు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. మే 15.2025 నాటికి 3ఎ గెజిటెడ్ నోటిఫికేషన్‌కు ముందర ఎవరైనా తమ భూమిని కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకుని కన్వర్షన్ అవ్వకపోయినా అటువంటి వారికి కూడా కన్వర్షన్‌నైన భూములకు వర్తించే రేటునే చెల్లించే అవకాశం ఉందన్నారు. 3డి నోటిఫికేషన్‌తో ఎవరు ఎంత మేరకు భూమిని కోల్పోతున్నారో స్పష్టత వస్తుందన్నారు. 165 జాతీయ రహదారిని 45 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్‌లు నిర్మించడం జరుగుతుందని, ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని కొన్ని ప్రాంతాలలో ఆర్ అండ్ బి రహదారిగా మార్పు చేయడం జరుగుతుందని జాతీయ రహదారి అధికారులు తెలిపారు. ఈ సమీక్షలో తహశీల్దార్ రామాంజనేయులు, భూ యజమానులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ఎస్ఐ మణికుమార్

గణపవరం : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సులు, ఆటోలకు చెందిన డ్రైవర్లతో మాట్లాడుతూ అతివేగంగా వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆటోలకు, బస్సులకు సంబంధించిన కాలపరిమితి పేపర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ డి.రత్నప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి పరిధిలో స్థలాలు లీజుకు..

భీమవరం టౌన్ : జిల్లాలోని పట్టణ, పరిసర ప్రాంతాలలో ఉన్న వ్యాపారస్తులకు భీమవరం, ఆకివీడు, కలిదిండి ప్రాంతాలలోని ఖాళీ స్థలాలలో 15 సంవత్సరములకు లీజుయిచ్చే ప్రాతిపదికన ఎపిఎస్‌ఆర్‌టిసి వారు టెండర్లు పిలిచారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలను శుక్రవారం భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులకండం కోటేశ్వరరావు హాజరైయ్యారు. దీనికి జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ అధ్యక్షత వహించి ఈ టెండర్ ప్రక్రియ పూర్తి సమాచారాన్ని తెలియజేశారు. ఈ సమావేశానికి సుమారు 25 మంది ఔత్సాహికులు హాజరయ్యారు. మరిన్ని వివరాలకు ఈ కింది నెంబర్లు 9959225482, 8341543351 సంప్రదించవలెనన్నారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషిచేయాలి : ఎంఎల్ఎ

భీమవరం టౌన్ : మార్కెట్ యార్డ్‌ను మరింత అభివృద్ధి చేయడంతోపాటు లాభాల బాటలో తీసుకెళ్లేందుకు కృషిచేయాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా నియమితులైన భీమవరం ఎఎంసి ఛైర్మన్ కలిదిండి సుజాత, రామచంద్రరాజు దంపతులు ఎంఎల్ఎ అంజిబాబును కలిశారు. టిడిపి బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, టిడిపి జిల్లా అధ్యక్షులు కలవపూడి రాంబాబును కలిశారు. కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎఎంసి ఛైర్మన్ సుజాత రామచంద్రరాజు మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని, మార్కెట్ కమిటీని కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. తమపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు బాధ్యతగా రైతు సంక్షేమం, అభివృద్ధికి మార్కెట్ యార్డ్‌ల అన్నదాతలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా కృషిచేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన కూటమి అధిష్టానానికి, కూటమి నాయకులకు, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కు

విద్యావంతులు రాజకీయాల్లోకి రావాల్సి ఉంది : మంత్రి భరత్

తణుకు : రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు సిఎం కృషి చేస్తున్నారని పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. విద్యావంతులు రాజకీయాల్లోకి రావడం ద్వారానే ఆ ప్రాంతం, తద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. మండలంలోని రూ.1.60 కోట్లు విలువైన అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణతో కలిసి మంత్రి భరత్ పాల్గొన్నారు. అనంతరం వేల్పూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లిన మంత్రి భరత్ గత ఏడాది కాలంగా అందుతున్న సంక్షేమం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్ఎ కృషి

తాడేపల్లిగూడెం : నియోజకవర్గ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులు నిలిచారని జనసేన నాయకులు పేర్కొన్నారు. జనసేన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌పై చేస్తున్న ఆరోపణలకి సమాధానం చెప్పారు. రాజకీయాలను వ్యాపారంగా చేశారని ఎద్దేవా చేశారు. విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఎఎంసి ఛైర్మన్‌గా శ్రీమన్నారాయణ

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురం టిడిపి పట్టణ అధ్యక్షులుగా కొనసాగుతున్న జక్కం శ్రీమన్నారాయణను ఎఎంసి ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న జక్కం శ్రీమన్నారాయణ పార్టీలో అనేక పదవులు చేపట్టి పార్టీ అభివృద్ధి బలోపేతానికి ఎంతగానో కృషిచేశారు. పార్టీ కష్టకాలంలోనూ ఆయన పార్టీకి సేవలందించారు. ఆయన అంకితభావాన్ని గుర్తించిన ప్రభుత్వం ఎఎంసిగా ప్రకటించడంపై పలువురు కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధినేత చంద్రబాబు తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేస్తానన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల


శంకుస్థాపన చేస్తున్న సర్పంచి

ఏలూరుపాడు గ్రామంలో వెంకయ్య వయ్యేరు పంట కాలువ నుంచి మంచినీటి చెరువులోకి పైపులైన్ నిర్మాణం పూర్తికావాలంటే మరో రూ.15 లక్షల నిధులు ప్రతిపాదనలు చేయాల్సి ఉందని గ్రామ కార్యదర్శి ఎస్.అరుణాదేవి అన్నారు. పైపులైన్ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.12 లక్షలతో వెంకయ్య వయ్యేరు నుంచి మంచినీటి చెరువు వరకు పైప్ లైన్ నిర్మాణ పనులు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎ.ఫణి, ఎంపిటిసి సభ్యులు చిన్నాపరపు రాంబాబు, వక్కపట్ల రాంబాబు, సచివాలయ గ్రామ కార్యదర్శి కొల్లి నాగ మోహిని పాల్గొన్నారు.

25 యూనిట్ల రక్తం సేకరణ

భీమవరం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన డిఎంహెచ్ఒ జి.గీత బాయ్ నేతృత్వంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, వివిధ ఎన్‌జిఒల ప్రతినిధులు ఈ శిబిరంలో పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ శిబిరంలో భీమవరం, తణుకు రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ల ద్వారా మొత్తం 25 యూనిట్లు రక్తం సేకరించారు. డిఎంహెచ్ఒ గీతబాయ్ రక్తదానంలో పాల్గొన్న సిబ్బందిని అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. అనంతరం ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఛైర్మన్ ఎంఎస్‌విఎస్.భద్రి రాజు, వైస్ ఛైర్మన్ వాబిలిశెట్టి కనక రాజు, డిస్ట్రిక్ట్ లెప్రసీ ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

నేను గ్రంధి శ్రీనివాస్‌కు అభిమానిని, అనుచరుడిని మాత్రమే : వెంకటేశ్వర్లు

భీమవరం టౌన్ : వైసిపి లీగల్ సెల్‌లో పనిచేస్తున్నట్లుగా సోషల్ మీడియాలో ఒక వార్త హల్‌చల్ చేయడం దారుణమని భీమవరం అడ్వకేట్ మారిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తాను న్యాయవాదిగా పనిచేస్తున్నానని, అయితే వ్యక్తిగతంగా మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌కు అభిమాని, అనుచరుడిని మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. అంతే తప్ప తనకు వైసిపిలో గాని, ఇతర రాజకీయ పార్టీలలో గాని సభ్యత్వం లేదని, రాజకీయ పదవులు లేవని ఆయన స్పష్టం చేశారు. కావాలనే కొంతమంది తనపట్ల ఈవిధంగా అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని వెంకటేశ్వరరావు వెల్లడించారు.

ఎంఎల్ఎ పితానికి కృతజ్ఞతలు

పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు



పెనుమంట్ర : సత్యవరం పిఎసిఎస్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చిన ఎంఎల్ఎ పితాని సత్యనారాయణకు పిఎసిఎస్ ఛైర్మన్ మైగాపుల నాగ వెంకట శ్రీరాములు(రాము) కృతజ్ఞతలు చెప్పారు. 2012 నుంచి 2017 వరకు రైతులకు సొసైటీ ద్వారా సేవలు అందించామని, రూ.6 లక్షల వ్యయంతో భవనం రిపేర్లు చేశామన్నారు. ప్రస్తుతం మరింతగా రైతులకు అన్ని విధాలుగా త్రి సభ్యులందరూ కలిసి సేవలు చేస్తామని రాము పేర్కొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


ఆచంట : మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సార్వా సాగు ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిపి తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు. ఈ తనిఖీలలో భాగంగా మండలంలోని కొడమంచిలి గ్రామంలో లక్ష్మీ రాఘవేంద్ర ఆగ్రో కెమికల్స్ దుకాణంలో రూ.3 లక్షల 67 వేల 62 విలువ కలిగిన బయో స్టిములేంట్స్ ఎరువులకు సరైన రికార్డులు లేనివిగా గుర్తించారు. ఈ సందర్భంగా అమెండ్మెంట్స్ పూర్తయ్యే వరకు సంబంధిత ఎరువులను విక్రయించరాదని ఆదేశాలు జారీ చేశారు. ఈ బృందంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.బుల్లిబాబు, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందుల షాపులు, గోడౌన్స్ శుక్రవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకుడు బుల్లిబాబు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గోపాలకృష్ణ ఉన్నారు.

నీరులేక ఎండుతున్న నారుమడులు

ప్రజాశక్తి - పోడూరు

మొద్దు నిద్రలో నీటి సంఘాల కమిటీలు..


గుమ్ములూరులో ఎండుతున్న నారుమడులు

జిల్లాలో సార్వా పంటకు నీరులేక నారుమళ్లు, దమ్ములు ఎండుతుంటే నీటిసంఘాల కమిటీలు, అధ్యక్షులు పట్టించుకోకపోవడం దారుణమని ఎపి కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ధ్వజమెత్తారు. సాగునీరు సమస్యపై పోడూరు, యలమంచిలి మండలాల్లో పర్యటించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ముందస్తు సార్వా సాగు చేపట్టాలని డప్పు కొట్టడం తప్ప ఆచరణలో అసలు ప్రణాళిక లేదని అన్నారు. రెండు నెలలుగా సాగునీరు అందక అనేకచోట్ల నారుమళ్లు చచ్చిపోతున్నాయని, దున్నిన దమ్ములు కూడా ఎండిపోతున్నాయని, కొన్నిచోట్ల ఈరోజుకి పంటబోదెలోకి సాగునీరే వెళ్ల లేని పరిస్థితి నెలకొందని అన్నారు. సార్వా సాగుకి కూడా రైతులు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ఇంజన్ల ద్వారా నీరుతోడటం సిగ్గు చేటన్నారు. ఇంత జరుగుతున్న అధికార పార్టీ నాయకులు, నీటిసంఘాల అధ్యక్షులకు రైతుల గోడు పట్టడం లేదని విమర్శించారు. సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడితే వరదనీరు చిక్కగా ఉండటంతో కాలువల్లో నీరు అందడం లేదని, వర్షం కురిసేదాకా మేమేమీ చేయలేమని వింత మాటలు చెబుతున్నారన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించకపోతే గ్రామాల్లో నీటిసంఘాల అధ్యక్షులను నిలదీయాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌలురైతులు గోగులమండ ఉదయ్, దిడ్ల ఆశీర్వాదం, కేతా దుర్గాప్రసాద్, గోగులమండ సూర్యనారాయణ, రాపాక వెంకటేశులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరం

ప్రజాశక్తి - గణపవరం

ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరమని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ఓంకార్ నాద్ అన్నారు. గణపవరం డిగ్రీ కాలేజీలో శుక్రవారం స్వర్ణాంధ్రా స్వచ్ఛ ఆంధ్రా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ నాద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ తయారు చేసే సమయంలో హానికరమైన వాయువులు విడుదల అవుతాయని, దీనివల్లగాలి కాలుష్యం అవుతుందని చెప్పారు. ప్లాస్టిక్ పదార్థాలు భూమి లోపల వందల సంవత్సరాలు ఉండిపోవటం వల్ల భూమి కూడా కాలుష్యం అవుతుందని అన్నారు. ప్లాస్టిక్ వల్ల నదులు, సముద్రాలు కాలుష్యం కావటంతో జల సంపద నాశనం అవుతుందని వివరించారు. రోడ్లపైన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న పక్షులు, జంతువులకు జీర్ణ వ్యవస్థ దెబ్బతిని చనిపోతున్నాయని వివరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల మానవాళికి కేన్సర్ ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకంమాని జ్యూట్ సంచులు, రాగి గాజు పాత్రలు వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు, కాలేజీ వైస్ ప్రిన్సిపల్ కె.స్వరూపరాణి, కెవి.గణేష్‌కుమార్, ఎన్‌విఎన్ బి.శ్రీనివాస్ రావు, జి.వెంకట్రావు, జి.వెంకటరమణ, భాస్కరావు, రాజాబాబు పాల్గొన్నారు.

తణుకు : స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి ఆధ్వర్యాన ప్లాస్టిక్ వాడకం నివారిద్దాం-పర్యావరణాన్ని సంరక్షిద్దాం కార్యక్రమం నిర్వహించారు. కాటన్ చేతి సంచులు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ ఎంఎస్ఆర్ ఆంజనేయులు(ప్రగతిరాజా) పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

వైసిపి నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి

ఆచంట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణరాజు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం పోడూరు మండలం తూర్పుపాలెం వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధ్యక్షతన నియోజకవర్గస్థాయి కార్యకర్తల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో బాబు 143 హామీలతో పాటు సూపర్ సిక్స్ ప్రకటించారన్నారు. ఏడాది దాటిన ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందన్నారు. అందరూ సమిష్టిగా పనిచేస్తే భవిష్యత్తులో మళ్లీ వైసిపిదే అధికారమన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరి ఉమాబాల, నియోజకవర్గ పరిశీలకులు ఖండవల్లి వాసు, సుంకర సీతారాం, జక్కంశెట్టి చంటి, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

తణుకు : తణుకులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచేసే విధంగా సౌకర్యాలను కల్పించడం అభినందనీయమని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. హైదరాబాద్ తర్వాత తణుకులోనే పుల్లెల గోపీచంద్ అకాడమీను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ముందుచూపుతో చిట్టూరి సుబ్బారావు ఏర్పాటుచేయడం హర్షించదగిన విషయమన్నారు. తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో చిట్టూరి సుబ్బారావు, గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలను శుక్రవారం ఎంఎల్ఎ రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ చిట్టూరి సుబ్బారావు స్థాపించిన అకాడమీతో క్రీడల పట్ల ఆయనకు ఉన్న మక్కువ అలాంటిదన్నారు. పోరాడి గెలవాలనే లక్ష్యంతో క్రీడాకారులు ముందుకు వెళ్లాలని కోరారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి మెంటే వంశీకృష్ణ, గ్రూపు కళాశాలల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, కంటిపూడి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మెట్ల సతీష్‌బాబు పాల్గొన్నారు.

20న ఉపకరణాలు అందజేత

పాలకొల్లు : వివిధ ప్రతిభావంతులు, వయో వృద్ధులకు సహాయ ఉపకరణములు అవసరమైన వారిని ఎంపిక చేయుటకు ఈనెల 20వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు పాలకొల్లు మునిసిపల్ కార్యాలయంలో ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. పరికరాలు అవసరం ఉన్నవారు ఈ కింది తెల్పిన ధ్రువపత్రాలు 2 కాపీల చొప్పున సదరం సర్టిఫికేట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, వికలాంగత్వం, ఫొటోలు 4, ఫోన్ నెంబర్ అన్ని మొత్తం 2 సెట్లు జిరాక్స్ కాపీలు సదరు శిబిరానికి వచ్చేటప్పుడు తీసుకుని రావాలని కోరారు. లబ్ధిదారులు సదరు తెలిపిన టైంకు తప్పక హాజరుకావాలని కోరారు.

రీ సర్వేపై రెవెన్యూ కార్యదర్శిని సంప్రదించాలి : తహశీల్దార్

తాడేపల్లిగూడెం : భూ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా ఏవిధమైన సమస్యలున్నా స్థానిక రెవెన్యూ కార్యదర్శిని సంప్రదించాలని తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ కోరారు. రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా పట్టణ పరిధిలోని యాగర్లపల్లి, కడకట్ల వ్యవసాయ భూములలో జరుగు రీ సర్వేలో భూములకు సంబంధించిన పట్టదారుని పేరు, మరణించిన పట్టదారులను తొలగించి దాని స్థానంలో అర్హులైన వారి కుటుంబ సభ్యులను మ్యుటేషన్ చేస్తారని తెలిపారు. దీనికి సంబంధించి అన్ని పత్రాలు, పట్టాలు రిజిస్టర్ దస్తావేజుల నకలు, ఆధార్, పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోస్ 4 తీసుకుని స్థానిక రెవెన్యూ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

రైతుల సమస్యలపై దృష్టి

నరసాపురం : సీతారాంపురం(నార్త్)లో రైతులు పంటలకు కాలువల ద్వారా నీరు అందక ఇబ్బంది పడుతున్న పరిస్థితిని తెలుసుకుని నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు వెంటనే స్పందించారు. రైతుల సమస్యలను పరిశీలించి ఆయా కాలువలను శుద్ధి చేయించాలి, నీటి ప్రవాహం నిర్బంధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత నీటిపారుదల అధికారులకు, వ్యవసాయ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్వా జోన్‌గా ఆకివీడు

మూడు రోజుల్లో అభ్యంతరాలు తెలపండి
మత్స్య శాఖాధికారి వివేక్
పలుచోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి - ఆకివీడు

నగర పంచాయతీ పరిధిలో ఉన్న మాదివాడ, ఆకివీడు, ధర్మాపురం మూడు రెవెన్యూ గ్రామాలను ఆక్వా జోన్‌గా ప్రకటిస్తున్నట్లు మత్స్య శాఖ అధికారి వివేక్ తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన రైతులతో మత్స్యశాఖ ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో వివేక్ మాట్లాడుతూ ఆయా రెవెన్యూ గ్రామాల పరిధిలో ఇప్పటికే రైతులు 484 ఎకరాలు అనుమతులు లేకుండానే చేపల చెరువులు నడుపుతున్నారని చెప్పారు. మరో 149 ఎకరాల చెరువుల అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారన్నారు. ప్రస్తుతం జోన్‌గా ప్రకటించిన ఈ గ్రామాలలో 2018-19 సంవత్సరాలలో ప్రకటించిన 1600 ఎకరాలు చేపల చెరువుగా ఉన్నాయన్నారు. ఆనాటి నుంచి ప్రభుత్వం 2025 సంవత్సరంలో మాత్రమే ఈ చేపల చెరువులే ఆక్వాజోన్ ప్రతిపాదనలు తీసుకొచ్చిందన్నారు. ఆక్వా జోన్‌గా ప్రకటించడం వల్ల ప్రభుత్వం మత్స్య అభివృద్ధికి ప్రకటించే రాయితీలన్నీ రైతులు పొందవచ్చునన్నారు. ఆ మేరకు త్వరలో ప్రభుత్వం ప్రకటించనుందని ఆయన చెప్పారు. పూర్తి వివరాలతో నగర పంచాయతీ కార్యాలయంలో నోటిఫికేషన్ వివరాలను ప్రకటిస్తున్నామన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే మూడు రోజుల్లో తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

15 మందితో గ్రామసభ : మత్స్య శాఖ శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆక్వాజోన్ గ్రామ సభకు సుమారు 10 నుంచి 15 మంది వరకు మాత్రమే రైతులు హాజరయ్యారు. గ్రామంలో ఉన్న ఆరవ వంతు రైతులు హాజరైతే మాత్రమే అది గ్రామ సభగా పరిగణించాలని ప్రభుత్వ నిబంధన విధించింది. ఆమేరకు గ్రామసభలు జరగవలసి ఉండగా తూతూమంత్రంగా నిర్వహిస్తుండడం గమనార్హం. ఈ పరిస్థితులలో ప్రజలకు తెలుసు అనే అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవ రూపంలో విషయాలు వారికి తెలియకుండగానే ప్రజల అనుమతితో జరుగుతున్నాయని ప్రభుత్వ ఉత్తర్వులు రావడం విశేషం.

పెన్షన్లలో అవినీతిని బయట పెట్టండి..

ఉండి : మంచం బారిన పడి లేవలేని పరిస్థితిలో ఉన్నట్లు కొంతమంది తప్పుడు సర్టిఫికెట్లను సమర్పించి రూ.15 వేల అక్రమ పెన్షన్ పొందుతున్నారని పలువురు టిడిపి నాయకులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం, కలిగొట్ల, వెలివర్రు గ్రామాలలో ఉపాధి హామీ చట్టంపై గ్రామసభలు నిర్వహించారు. ఎన్ఆర్‌పి అగ్రహారంలో జరిగిన గ్రామసభలో ఎస్ఆర్‌పి అచ్యుతరావు మాట్లాడుతూ గ్రామంలో రూ.15 వేల పెన్షన్ తీసుకునే వారు ఆరుగురున్నారని తెలపగా అందులో కొంతమంది అక్రమంగా పెన్షన్ పొందుతున్నారని, దీనిని రీ ఎంక్వయిరీ చేయాలని పలువురు టిడిపి నేతలు ఎస్ఆర్‌పిని కోరారు. వెంటనే స్పందించిన అచ్యుతరావు వెంటనే ఎంక్వయిరీ చేయించి నివేదికను శనివారం జరిగే మండల స్థాయి సోషల్ ఆడిట్‌కు అందజేస్తానని తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ఎస్‌సి కాలనీకి చెందిన కోణాల మేరీ అనే మహిళ తన భర్త సంసోను గత నాలుగు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో మంచం బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడని కుటుంబం గడవలేని పరిస్థితిలో ఉందని, తన భర్తకు పెన్షన్ ఇప్పించాలని అధికారుల ముందు మొరపెట్టుకున్నారు. వెలివర్రు గ్రామంలో జరిగిన సభలో ఫీల్డ్ అసిస్టెంట్ రూ.7,600 వేతనాన్ని పొందినట్లు తమ పరిచయంలో తెలిసిందని, అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబీకులు సుమారు రూ.20 వేల వేతనాన్ని అక్రమంగా పొందినట్లు అభియోగాలు వచ్చాయని డిఆర్‌పి తెలిపారు. కలిగొట్లలో జరిగిన సభలో సుమారు రూ.21 లక్షల పనులు జరిపించగా అందులో రూ.16 లక్షలు అధిక చెల్లింపులు జరిగాయని డిఆర్‌పి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎన్ఆర్‌పి అగ్రహారం ఎంపిటిసి మున్నలూరు సువర్ణ లక్ష్మి, ఉప సర్పంచి ఎం.సత్యనారాయణ, నాయకులు కిన్నెర వెంకన్న, కలిగొట్ల సర్పంచి ఎం.సత్య సూర్యనారాయణ, వెలివర్రు ఉప సర్పంచి ముదునూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

నరసాపురం: పేదల ఆర్థిక అసమానతలు తొలగించి వారిని మరింత బలోపేతం చేసేందుకు నిర్వహించేదే పి-4 సర్వేనని నోడల్ అధికారి వెంకట రమణ అన్నారు. మండలంలోని ఎల్‌బిచర్ల గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద పి-4 సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం రమణ మాట్లాడుతూ పి-4 సర్వే చేయడం వల్ల పేదలను ఆర్థిక, సామాజికంగా బలోపేతం చేసేందుకు వీలుంటుందని తెలిపారు. అనంతరం సర్వేలో ఎంపిక చేసిన పేర్లను గ్రామ సభలో చదివి వినిపించారు. డిఎల్‌డిఒ జి.రాణికి దర్బరేవు డ్రెయినేజీని ఆధునీకరించాలని వార్డు సభ్యులు బొడ్డు ఆశీష్‌కుమార్, తిరుమలశెట్టి వెంకటేశ్వరావు వినతిని అందించారు.